నిండా మునిగిన రైతు

- 550 ఎకరాల్లో వరి పంటకు నష్టం
- రైతులను దోచుకుంటున్న దళారులు
- కొనుగోలు చేయాలంటున్న అన్నదాతలు


దెబ్బతిన్న వరి పంట


దెబ్బతిన్న మినుము పంట

ఖాజీపేట : ఆరుకాలం కష్టపడి సాగు చేసిన రైతుకు నష్టాలే మిగులుతున్నాయి. వాతావరణ మార్పులతో పొగమంచు, విపరీతంగా వచ్చిన తెగుళ్లు, అధిక వర్షాలు పంట నష్టాన్ని మిగిల్చాయి. వచ్చిన పంటను అమ్ముకుందామంటే దళారులు ధర తగ్గించి రైతులను దోపిడీ చేస్తున్నారు. ఖాజీపేట మండలంలోని కేసీ, తెలుగు గంగ కాల్వలతోపాటు, చెరువులు, పెన్నా, కుందూ నదీ ప్రవాహాల ఆధారంగా బోర్లు, బావులకు నీటి లభ్యత ఉంది. దీంతో మిడుతూరు, సన్నపల్లె, ఏటూరు, త్రిపురవం, కొమ్మలూరు గ్రామాల రైతులు ఆగస్టు నుంచి జగిత్యాల(జెటీఎల్ 384) రకం వరి పంట సాగు చేశారు. గింజ వచ్చే దశ నుంచి అధిక వర్షాలు, వాతావరణంలో అధిక తేమ శాతం ఉండడంతో తెగుళ్లు పెరిగాయి. వీటి ప్రభావం పడడంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరాకు నాలుగు నుంచి ఐదు పుట్లు పండే పంట ఒక పుట్టికి పడిపోయింది. రైతులకు పెట్టుబడి కూడా వచ్చేలా కనిపించడం లేదు.

తీవ్రంగా నష్టపోయిన రైతులు

ఏటూరులో 100, మిడుతూరులో 150, సన్నపల్లెలో 50, త్రిపురవరం లో 150, కొమ్మలూరులో 60 ఎకరాల్లో వరి పంట నష్టపోయినట్లు రైతులు చెబుతున్నారు. ఎకరా వరి సాగుకు రూ.30 నుంచి రూ.35 వేల ఖర్చు వస్తోందంటున్నారు. దీనికి తోడు అరకొరగా వచ్చిన దిగుబడులు మార్కెట్‌కు తీసుకెళ్తే జగిత్యాల రకం ధాన్యాన్ని కేవలం పుట్టి రూ.10 వేల నుంచి రూ.11 వేలకు కొనుగోలు చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. ఏటూరు, మిడుతూరులో 150 ఎకరాల్లో మినుము పంట, 70 ఎకరాల్లో శనగ పంట దెబ్బతిందని తెలిపారు. పంట నష్టపోయిన అన్నదాత అల్లాడుతుంటే దళారుల దోపిడీ మరింత పెరిగింది. 75 కిలోల వరి ధాన్యం బస్తాకు బదులు దళారులు 78 కిలోలు తీసుకుంటున్నారు. దీనికి తోడు మార్కెట్ లో సిండికేట్‌గా ఏర్పడి వరి ధాన్యం ధర అమాంతం తగ్గించేస్తున్నారు. కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ధాన్యం ఇంట్లో పెట్టుకోలేక వచ్చిన కాడికి రైతులు దళారులకు అమ్మి నష్టపోతున్నారు.

వరి సాగుతో నష్టపోయాను



2.25 ఎకరాల్లో వరి సాగు చేశాను.. పురుగు మందులు పిచికారీ చేసినా దిగుబడి వచ్చేలా కనిపించలేదు. ఎకరాకు రెండు పుట్లు రావడం కష్టంగా ఉంది. వాతావరణ మార్పులు, ఎడతెరిపి లేని వర్షాలు పంటపై ప్రభావం చూపడంతో నష్టపోతున్నాం. – రామాంజనేయరెడ్డి, పాత ఏటూరు

పంట పూర్తిగా దెబ్బతింది



నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేశా. ఎకరాకు పుట్టి వడ్లు వచ్చే పరిస్థితి లేదు. ఐదెకరాల్లో మినుము సాగుచేసినా దిగుబడి దారుణంగా పడిపోయింది.. అధిక వర్షాలు, పొగ మంచు ప్రభావం రైతులకు నష్టాలను మిగిల్చింది. – ఏనుగు రాజగోపాల్‌రెడ్డి, ఏటూరు

రేణి పురుగుతో నష్టం



నాలుగెకరాల్లో వరి, మరో నాలుగెకరాల్లో పత్తి, రెండెకరాల్లో మినుము వేశాను. రేణి పురుగుతో పత్తి పంట దెబ్బతింది.. దిగుబడి అరకొరగా వచ్చింది. మినుము పూర్తిగా దెబ్బతింది. వాతవరణ మార్పులే దిగుబడి తగ్గేందుకు కారణం. – కనమల రాఘవరెడ్డి, ఏటూరు

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ మౌనం సరికాదు


ఎస్టీయూ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు, ఎస్టీయూ నాయకులు

కలసపాడు : ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మౌనంగా ఉండటం తగదని ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి పి.రమణారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.శేఖర్‌బాబులు పేర్కొన్నారు. గురువారం కలసపాడు ఎంపీపీ పాఠశాలలో ఎస్టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు పూర్తయినప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై దృష్టి సారించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నెలలుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్‌లీవ్ బిల్లులు, హాఫ్ పేలీవ్ ఎన్ క్యాష్‌మెంట్, జెడీపీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, ఫైనల్ పేమెంట్లు, పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, ప్రతి నెల జీతాల నుంచి మినహాయించి పొదుపు చేసుకున్న వాటిని కూడా చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. 2వ తేదీన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో మధ్యంతర భృతి, డీఏలపై ప్రకటన చేస్తారని ఉద్యోగులంతా ఎంతో ఆశగా ఎదురుచూసినప్పటికీ ఎలాంటి చర్చ గాని నిర్ణయాలు గాని తీసుకోకపోవడంతో తీవ్ర అసంతృప్తికి లోనయ్యారన్నారు. ప్రభుత్వం ఇదే ధోరణిని అనుసరిస్తే ఉద్యమ కార్యాచరణ చేపట్టక తప్పదని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రేమ్‌సాగర్, మస్తాన్‌వలి, ఎస్టీయూ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.వెంకటరెడ్డి, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభల కరపత్రాలు విడుదల


మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న ఫెడరేషన్ నాయకులు

ప్రొద్దుటూరు : ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) కడప జిల్లా 4వ మహాసభ కరపత్రాలను గురువారం స్థానిక తమ కార్యాలయంలో నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వై.హరి మాట్లాడుతూ ఆటో అండ్ మోటార్ వాహనాల కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. వారికి ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వాహన మిత్ర పథకాన్ని అమలు చేసి కార్మికులకు రూ.15వేలు ఇవ్వాలని కోరారు. జనవరి 21, 22 తేదీల్లో జరిగే ఈ మహాసభల్లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, ఎల్లయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ


ఎస్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న నేతలు


నరసాపురంలో ఏపీయూఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ నిర్మల

పోరుమామిళ్ల : ఎస్టీయూ 2025 క్యాలెండర్, డైరీని గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల విద్యాశాఖ అధికారి బాల అంకిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి, వైద్యులు కరిష్మా, చెన్నారెడ్డి, వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ భవిష్యత్తు నిర్దేశకులు తయారయ్యేది తరగతి గదుల్లోనే అన్నారు. అలాంటి విద్యార్థులను సరైన దిశలో నడిపించి దేశానికి ఉత్తమ పౌరులను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్టీయూ రాష్ట్ర అదనపుప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, రాష్ట్ర కళావేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సంఘాలు సమష్టిగా పనిచేస్తేనే ఏమైనా సాధించుకోగలమన్నారు. ఎందరో త్యాగధనుల పోరాటాల ఫలితమే ఇప్పుడు మనం అనుభవిస్తున్న ఫలాలన్నారు. ఎస్టీయూ డైరీ ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

ఏపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

కాశినాయన : మండలంలోని నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) 2025వ సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ నిర్మల, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొండిశెట్టిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కారించేందుకు ఈ సంఘం కృషి చేస్తుందన్నారు. అంతేకాకుండా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన అందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదోన్నతులపై పక్షపాత వైఖరి సరికాదు


డిప్యూటీ తహసీల్దార్ సాయినాథ్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : రాయలసీమ ప్రాంత పోలీసుల పదోన్నతులపై ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పక్షపాత వైఖరి సరికాదని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి, ఆర్‌సీపీ పట్టణ కార్యదర్శి షరీఫ్, బీఎస్పీ ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తీట్ల రవికుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నమ్మ తెలిపారు. గురువారం డిప్యూటీ తహసీల్దార్ సాయినాథ్‌రెడ్డికి ఈ మేరకు వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1996, 1998 బ్యాచ్ ఎస్ఐలకు ఇప్పటికీ డీఎస్పీలుగా ప్రమోషన్ పొందని వారు రాయలసీమ ప్రాంతంలోనే ఉన్నారన్నారు. ఆంధ్ర ప్రాంతంలో 2003 బ్యాచ్ ఎస్ఐలు ఇప్పుడు డీఎస్పీ ప్రమోషన్ లిస్ట్‌లో ఉన్నారని తెలిపారు. రాయలసీమ ప్రాంత ఉద్యోగులపై కక్షసాధింపు చేస్తున్నారన్న అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇప్పటికీ అమరావతిని ఫ్రీజోన్‌గా చేయలేదని విమర్శించారు. రాయలసీమను యూనిట్‌గా తీసుకుని ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

శ్రీనివాసపురంలో పొలం పిలుస్తోంది


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

గోపవరం : మండలంలోని శ్రీనివాసపురంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ ఈ కార్యక్రమంలో పాల్గొని పంటల సాగు తదితర అంశాలపై రైతులకు రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత సీజన్‌లో సాగైన మొక్కజొన్న, సజ్జ పంటలను పరిశీలించారు. మొక్కజొన్న పంటను కత్తెరపురుగు ఆశించే అవకాశం ఉందని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. పంటల బీమా, ఈ–పంట నమోదు, పీఎం కిసాన్‌లపై అవగాహన కల్పించారు. నానో డీఏపీ, నానో యూరియా వాడకం వలన కలిగే ఉపయోగాలను రైతులకు వివరించారు. అనంతరం గోపవరం రైతుసేవా కేంద్రాన్ని ఏడీఏ ఆకస్మిక తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించి రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి విజయకుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విజయభాస్కర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సాయం చేయండి ఇంటర్నేషనల్ షూటింగ్‌లో పాల్గొంటా


క్రీడాకారుడు హరిబాబు

పోరుమామిళ్ల : మండలంలోని నాగలకుంట్లకు చెందిన రాయపాటి హరిబాబు ఇటీవల తాడిపత్రిలో జరిగిన జాతీయస్థాయి షూటింగ్ బాల్ గేమ్స్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి ఇంటర్నేషనల్ షూటింగ్ బాల్‌గేమ్స్ పోటీలకు అర్హత సాధించాడు. త్వరలో నేపాల్‌లో ఇంటర్నేషనల్ గేమ్స్ జరుగనున్నాయి. అందులో పాల్గొని సత్తా చాటాలని హరిబాబు ఆరాటపడుతున్నాడు. అయితే అతనిది నిరుపేద దళిత కుటుంబం. నేపాల్‌కు వెళ్లడానికి ఆర్థిక స్థోమత లేదు. నాగలకుంట్లకు చెందిన రాయపాటి చిన్న అంకాలయ్య, గురమ్మ దంపతుల పెద్ద కుమారుడు హరిబాబు. కడపలో ఐటీఐ కళాశాలలో చదువుతున్నాడు. తల్లిదండ్రులకు పిల్లలను పోషించడమే భారంగా ఉన్న స్థితిలో ఉన్నామని నేపాల్ వెళ్లేందుకు దాతలు సహాయం చేయాలని కోరుతున్నారు. హరిబాబు కూడా ఆర్థికంగా సహకరిస్తే నేపాల్ పోటీల్లో ప్రతిభ చూపుతానంటున్నాడు. సహకరించే దాతలు 8179895382, 9014394783 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయ సేకరణ

ఖాజీపేట : ఎస్సీ వర్గీకరణ విషయమై తమ అభిప్రాయాలను ప్రభుత్వం నియమించిన కమిషన్ ఎదుట రాతపూర్వకంగా తెలియజేయాలని ఎస్ డబ్ల్యూఓ స్వర్ణలత తెలిపారు. అభిప్రాయాల సేకరణకు రాజీవ్ రంజన్ మిశ్రా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిషన్ సభ్యులు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కడప కలెక్టరేట్‌లోని సభాభవన్‌కు వస్తారన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ ఉప కుల సభ్యులు హాజరై తమ అభిప్రాయాలను వివరించవచ్చునని తెలిపారు.

నేడు మండల సమావేశం

ఖాజీపేట : ఖాజీపేట మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దివిజా సంపతి తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ హాజరవుతారన్నారు. మండల అధికారులు వివరాలతో రావాలని, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి తప్పకుండా హాజరు కావాలని కోరారు.

చాపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరకిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

చాపాడు : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు సహకరించాలని మండల విద్యాధికారి రవిశంకర్ పేర్కొన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. బడి బయట విద్యార్థులను సభ్యులు పాఠశాలల్లో చేర్పించాలని, బాలల హక్కుల పరిరక్షణకు తోడ్పాటు అందించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, మన బడి మన భవిష్యత్తు, మధ్యాహ్న భోజన పథకం పథకాలపై దృష్టి కేంద్రీరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 వంశీకృష్ణ, ఆర్పీలు కృష్ణయ్య, రిజ్వాన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు : మండలంలోని కామనూరు గ్రామంలోని రాధానగర్‌లో స్వగృహంలో ఉన్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి గురువారం ప్రొద్దుటూరులో ఉర్దూ డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలని ఎంపీజే నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, రాయలసీమ ఇన్‌చార్జి ఎండీఓ అయూబ్ ఖాన్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కమలాపురం, మైదుకూరు ప్రాంతాల నుండి ఇంటర్మీడియట్ ఉర్దూ చదివిన విద్యార్థులు ఉర్దూ డిగ్రీ చదివేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఉర్దూ డిగ్రీ కాలేజీ లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లలేక విద్యార్థులు ఇంటర్ విద్యతోనే చదువును ఆపేస్తున్నారని తెలిపారు. ప్రొద్దుటూరులో ఉర్దూ డిగ్రీ కాలేజీని మంజూరు చేయించాలని ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాష, కార్యదర్శి రఫీ, సభ్యులు ముక్తియార్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి సహకరించాలి


ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు చెత్తను మురికి కాలువల్లో వేయకుండా మున్సిపల్ సిబ్బందికి ఇచ్చి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. గురువారం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో కమిషనర్ పర్యటించారు. మోడంపల్లె మసీదు వద్ద ఉన్న చెత్తపాయింట్‌ను పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. కాలువల్లోని పూడికను తొలగింపజేశారు. మోడంపల్లె వీధి మోటు వద్ద కల్వర్టు నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులను కమిషనర్ ఆదేశించారు. హిందూ శ్మశాన వాటికలో ఉన్న వాటర్ ట్యాంక్ ఓవర్ ఫ్లో అయినప్పుడు శ్మశాన వాటికలోకి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సునీత పాల్గొన్నారు.

6న కలెక్టరేట్ వద్ద దీక్ష

ప్రొద్దుటూరు : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఈనెల 6న ఉదయం 10 గంటలకు కడప కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) జిల్లా డిప్యూటీ కార్యదర్శి పూసల యేసోబు తెలిపారు. గురువారం పట్టణంలో నిరాహార దీక్ష కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా సీఎం చంద్రబాబు కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని, అధికారం చేపట్టి ఏడు నెలలైనా ఇప్పటికీ అమలు చేయలేదన్నారు.

నేడు జిల్లాకు ఏకసభ్య కమిషన్ రాక

బద్వేలు అర్బన్ : ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్‌రంజన్‌మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ శుక్రవారం జిల్లాకు రానున్నట్లు బద్వేలు సహాయ సాంఘిక సంక్షేమశాఖాధికారి ఎ.రామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు కలెక్టరేట్‌లోని సభా భవనంలో కమిషన్ సభ్యులు ఎస్సీ సామాజిక వర్గంలోని వివిధ ఉపకుల సభ్యులు, సంఘాల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారన్నారు. వినతిపత్రాలు అందించేవారు జిల్లాకు చెందిన వారై ఉండాలని ఆయన తెలిపారు.

విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో రతనాల వేంకటేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీలలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ధనుర్మాసం, స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. వేకువజామున వెంకటేశ్వరస్వామి మూలవిరాట్‌కు విశేష పూజలతో పాటు, శ్రీదేవి భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి, స్వామివారి చెల్లెలు లలితాదేవి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు చేసి కర్పూర హారతులు ఇచ్చారు. భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. పూజాకార్యక్రమానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

భూ సమస్యలను పరిష్కరించుకోండి


మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రమోహన్

కాశినాయన : గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ తెలిపారు. గురువారం మండలంలోని వంకమర్రి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశామని, సమస్యలు ఏవైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు వెంకటసుబ్బయ్య, డీటీ రవిశంకర్, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ


అట్లూరు : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గురువారం అట్లూరు క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించి రికార్డులను పరిశీలించారు. సక్రమంగా లేని వాహనాలకు, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ భాస్కర్, సిబ్బంది ఉన్నారు.

వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ

చాపాడు : స్థానిక కాశినాయన వృద్ధాశ్రమంలో నక్కలదిన్నెకు చెందిన శెట్టిపల్లె నాగిరెడ్డి గురువారం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. నక్కలదిన్నె గ్రామానికి చెందిన శెట్టిపల్లె రామకృష్ణారెడ్డి సతీమణి జయమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు శెట్టిపల్లె నాగిరెడ్డి తెలిపారు.

మంచుకురిసే వేళలో..


పచ్చని పంట పొలాలపై కమ్ముకున్న పొగమంచు


బద్వేలు-నెల్లూరు జాతీయ రహదారిపై హెడ్‌లైట్ వేసుకుని వస్తున్న వాహనదారులు


బైపాస్ రోడ్డులో కమ్మేసిన పొగమంచు

బద్వేలు పట్టణాన్ని గురువారం పొగమంచు కమ్మేసింది. తెల్లవారుజాము నుంచే దట్టమైన పొగమంచు కమ్మేయడంతో ఊటి వాతావరణం తలపించింది. తెల్లవారుజామునే వాకింగ్‌కు వెళ్లే పాదాచారులు, వివిధ రకాల పనుల కోసం బయటికి వచ్చిన ప్రజలు ప్రకృతి రమణీయతను చూసి పరవశించిపోయారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దట్టమైన పొగ మంచు ఏర్పడటంతో ప్రజలు ప్రకృతి రమణీయ దృశ్యాలను తమ సెల్‌ఫోన్‌లలో బంధించి సంబరపడిపోయారు. ఉదయం 8:30 గంటల వరకు దట్టమైన పొగమంచు కారణంగా వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. తెల్లవారినప్పటికీ హెడ్‌లైట్లు వేసుకుని నిదానంగా వాహనాలను నడపాల్సి వచ్చింది. – బద్వేలు అర్బన్